


# పట్టు పరికిణి

పంతుల జోగారావు

మధ్యాహ్నం రెండవుతూంది. ముందురోజురాత్రి కుట్టిన నిక్కర్లకు కాజాలు వేసి గుండీలు కుడుతూకూర్చుంది జానకి. నిర్మల సాయంత్రం స్నేహితురాండ్రతో ఆడబోయే బొమ్మలాటకు తాటాకుబొమ్మల్ని తయారుచేసుకుంటూంది.

"ఎప్పుడూ ఆట ధ్యాసేకానీ చదువుకుందామన్న జ్ఞానంలేదే నీకూ?" దీర్ఘం తీస్తూ నవ్వుతూ అంది జానకి.

"చదివేసుకున్నానుగా?" తల తిప్పకుండానే జవాబిచ్చింది నిర్మల.

"ఏం చదివేవు నీ ముఖం?"

నిర్మలకు కోపంవచ్చింది. తల్లికి జవాబు చెప్పకూడదనుకుంది. తాటాకురేకులు చీలుస్తూ మాట్లాడకుండా కూర్చుంది. జానకి ఏదో అనబోయేలోపల వీథిలోనుంచి "పోస్ట్!" అన్న కేక వినిపించింది.

"నిమ్మీ, ఉత్తరం అందుకో."

నిర్మల సంబరంగా వీథిలోకి పరుగెత్తి పోస్ట్‌మాన్ ఇచ్చిన ఉత్తరం అందుకుంది. అడ్రసు చూడగానే అదెక్కడినుండి వచ్చిందో అర్థమైపోయింది. అడ్రసు రామం బాబాయిగారి దస్తూరీతో ఉంటుంది. లోపల విజయక్క రాసిన ఉత్తరం వుంటుంది.

"విజయక్క ఉత్తరం రాసిందే!" నిర్మల సంతోషంతో నవ్వుతూ తల్లి చేతికందించింది ఉత్తరాన్ని.

జానకి ఉత్తరాన్ని ఓసారి ముద్దుపెట్టుకుని మరీ చదివింది.

"అమ్మకి నమస్కారములు. ఇచ్చట నేను, అమ్మ, నాన్నగారు క్షేమం. నువ్వు, చెల్లి క్షేమమని తలుస్తాను. సోమవారం ఉదయం శంకరం పెదనాన్న గారింటికి నేనూ, అమ్మా వస్తున్నాము. ఆ సాయంత్రంలోగా మనింటికి వస్తాను. లేదా, నువ్వే చెల్లిని తీసుకొనివస్తే మరీ మంచిది. చెల్లిని అడిగానని చెప్పు.

"ఇట్లు

"విజయ."

నిర్మల సంతోషం పట్టలేక తల్లి మెడచుట్టూ చేతులువేసి వాటేసుకుంది. "అబ్బ! విజయక్కను చూసి ఎన్ని రోజులైందో!"

జానకి కళ్లవెంట వచ్చిన కన్నీరు జారిపోతూవుంటే చీరకొంగుతో ఒత్తుకుంది.

"ఏమ్మా, ఏడుస్తున్నావు?"

"ఏం లేదమ్మా."

"చెప్పవూ?"

"పిచ్చీ, ఏం లేదే... మీ అక్క వస్తోంది కదూ?"

"అయితే ఏడవటమెందుకు?"

"నీకు తెలీదులే నిమ్మీ!"

నిర్మలకు చప్పున ఎప్పుడో ఏదో సినిమాలో తను విన్న పాటలోని "నవ్వినా ఏడ్చినీ కన్నీళ్లే వస్తాయి" అన్నముక్క గుర్తొచ్చింది. అందుకే కారణం చెప్పమని మరి తల్లని బలవంతపెట్టలేదు.

ఆ పిల్ల మనసు మనసులో లేదు. అక్క వస్తూందనే తియ్యని ఆలోచనతో పరవశించిపోతూంది. ఆ చిన్నమెదడు నిండా ఆలోచనలు ఉక్కిరిబిక్కిరిగా చోటు చేసుకున్నాయి. అక్కతో తన ముచ్చట్లు తలుచుకుంటూ సంతోషంతో తలమునకలవుతూంది.

అక్కతో తిరగటం ఎంత బాగుంటుంది! ఆడుకోవాలంటే దానితోనే ఆడుకోవాలి. దానికెన్ని ఆటలు వచ్చునని!

**ఈ కథ ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 8.1.1971 సంచికలో ప్రచురితమైంది**

బొంకులదిబ్బ దగ్గరికి వెళ్లినప్పుడల్లా తనకు ఎక్కువ ఆశ్చర్యం కలిగించేది రాజుగారి కోట! ఎత్తయిన ఆ కోట గోడలమీద ఎన్ని పావురాలుంటాయని!

"మనల్ని రానిస్తారా లోపలికి?" ఓసారి అడిగింది అనుమానంగానే.

అక్క కిసుక్కున నవ్వింది. "రానివ్వకపోవడమేమిటీ? ఇప్పుడందులో అంతా చదువుకునే అమ్మాయిలూ, అబ్బాయిలూ వుంటారుగా! రా, చూద్దాం" అంటూ తనను తోడ్కుకుపోయి అంతా చూపించింది. గంటనీ, గంటలు కొట్టే ముసిలిబంట్రోతునీ కూడా చూపించింది. రౌండుమహలు చూపించింది. పావురాలగూడు చూపించింది. ఆడపిల్లల బడికూడా చూపించింది.

ఎందుకో మరి, అక్కను ఓసారి రామం బాబాయియూ, సుమిత్రపిన్నీ ఓరోజు వచ్చి తీసుకొనిపోయారు. ఆ వేళ ఇంట్లో పండుగ లాంటిది కూడా చేశారు. అమ్మ ఆవేళ కూడా నవ్వుతూనే వుంది.

విజయక్క రిక్షా ఎక్కుతూవుంటే తనకు ఏడుపు ముంచుకుని వచ్చింది. బావురుమంది. అమ్మ తనని దగ్గరికి తీసుకుంది. పిన్ని తన చేతిలో ఓ రూపాయి ఉంచింది. అమ్మ లడ్డూ ఇచ్చింది.

పిన్ని డబ్బులిస్తుంది కాని అక్కను తీసుకొని వెళ్లటం మానదు.

అమ్మ తినటానికిస్తుంది తప్ప అక్కను వదిలేయమని వాళ్లతో చెప్పదు. అక్క వెళ్లకపోతే ఆ డబ్బుతో నేల సినిమాకి ఇద్దరూ కలిసివెళ్లవచ్చును. అక్క వెళ్లకపోతే ఆ లడ్డూ పెట్టి అక్కా, తనూ బొమ్మల వంటలాట ఆడుకోవచ్చును!

అక్కను తీసుకువెళ్లవద్దని ఆ వేళ అమ్మ చెప్పనూలేదు, వాళ్లు ఉంచనూలేదు. అక్క వెళ్లిపోయాక తను పడిన బాధ అంతా ఇంతా కాదు. మొదట్లో రోజంతా ఏడుస్తూనే గడిపింది.

అప్పుడు వెళ్లిన అక్క మళ్లీ ఇన్నాళ్లకు వస్తూంది!

అబ్బ! అక్క వస్తూంది!

ఈ ఆలోచన నిర్మల మనస్సుని ఆనందంతో తబ్బిబ్బు చేస్తూంది. ఆ పిల్ల మరునాటి ఉదయం తాను అనుభవించబోయే అపరిమితమైన ఆనందంలోని మాధుర్యాన్ని గురించి ఈ క్షణంలోనే ఊహలుపోతూంది.

"అమ్మా, అక్క ఇప్పుడు బాగా మారిపోయివుంటుంది కదే!"

జానకి గతుక్కుమంది. అవును! విజయ... తన విజ్జీ... తన ప్రాణం... బాగా మారిపోయివుంటుంది! మారదూ? ఇంకా తనదగ్గర ఉన్నప్పటిలాగే చింకిపరికిణీతో, చింపిరిజుట్టుతో వుంటుందా? బాగా మారిపోయివుండాలి... పనికి దొంగతనం పడకుండా తనేం చెబితే అది చేస్తూకూడా కాజాలు సరిగా వేయకపోతే తనచేత చీవాట్లూ, దెబ్బలూ తినేది. ఛీ! పాపిష్టి చేతులు, ఆ బంగారుతల్లిని కొట్టడానికి తన మనసు ఎలా అంగీకరించేదో!

రోజంతా ఎవరివో బట్టలు కుడుతూనేవుంటుంది తను-తమకి మాత్రం సరైన బట్టలుండవు. బట్టలవరకూ ఎందుకు? భర్త పోయాక తృప్తిగా ఒక రోజైనా కడుపునిండా తిందా, పిల్లలకు పెట్టిందా? జానకికి దుఃఖం వచ్చింది. కళల్లో నీళ్లు తిరిగాయి. విజయ అక్కడే సుఖపడుతుంది. ఈ బీదతల్లి దగ్గర వుండేకన్నా అక్కడే ఆనందంగా

## కూతురికి రక్షణ!

అలనాటి హీమాన్ ధర్మేంద్ర తన కూతురు ఈశాదేవల్ షూటింగులకు పోతున్నప్పుడు కూడా వుండి రక్షించేందుకు బాడీగార్డులను నియమించాట్ట. ఇది చూసి అందరూ నవ్వుకుంటుంటే పాపం, ఈశకు చాలా విసుగ్గా వుందట. కానీ పరిశ్రమలో జనం ఎలాంటివారో తనకు తెలుసు కనుక ధర్మేంద్ర తీసుకున్న ముందుజాగ్రత్త చర్య మంచిదేనంటున్నారు సినీజనం. తమను గురించి తమక్కాక మరెవరికి తెలుస్తుందని కొందరు చెవులు కొరుక్కుంటున్నారట కూడా! అదండీ బాలీవుడ్!

ఎస్.



గడుస్తుంది దానికి.

ఆయన తాలూకా ఆఫీసులో గుమాస్తాగా పనిచేసేవారు. మాయుదారి జ్వరం ఒక్కరోజు వచ్చి తీసుకొనిపోయింది. తనకి అమ్మా, నాన్నా చిన్నతనంలోనే పోయారు. తననీ, ఇద్దరు పిల్లలనీ పోషించే బాధ్యత స్వీకరించటానికి ఎవరూ సిద్ధపడలేదు. మొదట్లో అంతా కలిసి కొంత ధనసహాయం చేశారు-అంతే. దానితోనే ఈ కుట్టుమిషను కొంది. ఈ వేళ తన సంసారం దానిమీదే ఆధారపడివుంది. ఆయన పోయాక ఏడాది తిరిగేవేళకి మరిది రామం, తోటికోడలు సుమిత్ర పెద్దదాన్ని మాత్రం తమతో విశాఖపట్నం తీసుకుపోయి పెంచుకుంటామంటూ వచ్చారు. వాళ్లకి సంతానం లేదు. వాళ్ల దగ్గిర విజయ సుఖంగా పెరుగుతుందనిపించినా-మమత అడ్డం వచ్చి, ఎలాగో ఒకలా తమతోపాటే అదీ రోజులు గడుపుతుందిలే అనే ఆలోచనతో దాన్ని వారితో పంపటానికి ఇష్టపడలేదు. కాని. వాళ్లు ఊరుకోలేదు. ఎన్నోవిధాల చెప్పారు. శంకరం వాళ్లచేతా, వీళ్లచేతా చెప్పించారు. దాన్ని పెద్ద చేసి, చదువు చెప్పించి, పెళ్లి చేసే బాధ్యత తాము వహిస్తామన్నారు.

అంగీకరించక తప్పలేదు తనకి. విజయను వాళ్లు పెంచుకునేందుకు తీసుకుపోయారు. అది వెళ్లిపోయేముందు, తన ఒడిలో చేరి ఒక్కలా ఏడుస్తూవుంటే తనకీ దుఃఖం ఆగింది కాదు. దాని తల నిమురుతూ అంది: "అమ్మా, విజ్జీ! నా తల్లీ! బంగారుకొండవి. అలా ఏడవవచ్చునా? తప్పుకాదూ? నామాట వింటావు కదూ? ఇక నుంచి రామం బాబాయిని 'నాన్నగారూ' అని పిలవాలి. పిన్నిని 'అమ్మా' అని పిలవాలి... తెలిసిందా? నువ్వక్కడ చక్కగా చదువుకోవచ్చును. సరదాగా ఆడుకోవచ్చును. నా తల్లివి కదూ?" చెబుతూవుంటే కన్నీళ్లు జలజలా రాలిపోయాయి.

విజయ బుద్ధిమంతురాలు. తన మాట దానికి వేదవాక్కే. వెళ్లిన దగ్గరనుంచీ అక్కడ బుద్ధిగా వుంటూంది. ఏణ్ణర్థం క్రిందట ఒకసారి తీసుకొనివచ్చారు. అంతే, మళ్లీ ఇప్పుడే రావటం!

"ఏమ్మా, మాట్లాడవు?"

జానకి నిర్మల పిలుపుతో ఆలోచనల నుంచి తేరుకుంది. నిర్మల తల నిమురుతూ నవ్వి అంది: "ఏం మాట్లాడను? ఎలాగూ రేపు వస్తున్నానని ఉత్తరం రాసిందిగా! చూడబోతూ నన్నెందుకు అడగటం?"

నిర్మల ఓ క్షణం మ్ముభావంగా వుండి ఏదో గుర్తొచ్చినట్లుగా అడిగింది: "మరి, అక్క ఈసారి కూడా మనింటికి రావటం లేదేమిటమ్మా? శంకరం పెదనాన్న గారింటికి వస్తోందేం?"

జానకి గుండెను ఎవరో ఇనుపతొడుగులతో పిండినట్లయింది. బాధతో విలవిలలాడిపోయింది. గుండె సహస్రధా ఛిద్రమైపోయి, దుఃఖం వెల్లువలా బయటకు వచ్చేస్తుందేమో అనిపించింది. వణుకుతున్న పెదిమలను కరుచుకుని వదిలి కుమార్తెను గుండెలకు హత్తుకుంది. "ఛా! లేదు తల్లీ! అలా అనచ్చా? ఎక్కడికి వస్తేనేం... అదీ మనిల్లేగా? శంకరం పెదనాన్న గారింటికే గదా వస్తోంది? రాగానే వెళ్లి చూసొద్దాం...సాయంత్రమో, ఎప్పుడో ఓసారి మనింటికి కూడా వస్తుందిలే."

ఆమె తనకు తెలియకుండానే కుమార్తె తలను కన్నీళ్లతో తడిపేసింది.

000

ఉన్నవాటిలో కాస్త మంచిగౌను తీసి ఉతికి ఆరవేసి నిర్మలకు తొడిగించింది జానకి. తనుకూడా తయారై ఇంటికి తాళంవేసి నిర్మలను వెంటబెట్టుకుని శంకరం గారింటికి బయలుదేరింది.

ఉదయం పదకొండు గంటలైంది. సుమిత్రా, విజయా ఓ గంటక్రిందటే విశాఖపట్నం నుంచి వచ్చివుండాలి. దారిలో కొంచెం మిఠాయి, పువ్వులూ కొంది జానకి.

వీథిగుమ్మంలోనే విజయ ఎదురైంది. ఎంతలా మారిపోయిందో! ఖరీదైన బట్టలతో పెద్దఆఫీసరుగారి కుమార్తెలా వుంది. పొందికగా నిల్చునివుంది. ఎడమచేతికి వాచీ, ఉంగరం. జడగంటలు వేసుకున్న జడను ముందుకు వేసుకుని సున్నితంగా ఎగరేస్తోంది.

జానకి కళ్లు చెమర్చాయి. ఆమె ఆశించినట్లుగా ఆ పిల్ల తమను చూడగానే పరుగెత్తుకుని వచ్చి తనను వాటేసుకుని పోలేదు. బావురుమనలేదు! స్తిమితంగా నడుచుకుని వచ్చి నవ్వుముఖంతో పలకరించింది. దీనికింత పెద్దమనిషి తరహా ఎప్పుడొచ్చిందీ? నిర్మల చేతిని తనచేతిలోకి తీసుకుని నెమ్మదిగా నొక్కుతూ "చెల్లీ, బాగున్నావా?" అనడిగింది. మాటకూడా పూర్తిగా మారిపోయింది. పూర్వం పట్టి పసపిట్టలా వాగేది. చెల్లెలితో మాట్లాడటమంటే ఒళ్లు మరిచిపోయేది!

విజయ నిజంగానే మారిపోయింది. విశాఖపట్నంలో మంచి వాతావరణంలో పెరుగుతోంది. ఆ మాత్రం హుందాతనం రాకమానుతుందా? నిర్మల అక్క వేపు ఆశ్చర్యపోతూ చూస్తూ, ఆ పిల్ల వేసుకున్న బట్టల్ని భయంభయంగా సంభ్రమంతో తాకుతూవుండటం గమనించి జానకి మనస్సు చివుక్కుమంది.

సుమిత్ర ఎదురొచ్చి జానకిని ఆహ్వానించింది. శంకరంగారూ, అతని భార్య వరలక్ష్మికూడా వచ్చి పలకరించారు. ఒకే వూళ్లో వున్నా వారిమధ్య రాకపోకలు అరుదు. బంధువులెవరికీ జానకి బట్టలు కుట్టుకుంటూ బ్రతుకును వెళ్లమార్చడం ఇష్టం లేదు. అలాగని ఆమెను పోషించేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు.



## మీనాకుమారితో మినీ ఇంటర్వ్యూ

'హిట్లర్' చిత్రంలో చిరంజీవి చెల్లెళ్లలో ఒకామెగా నటించింది మీనాకుమారి.

'హిట్లర్' చిత్రంలో మీ పాత్రను గురించి చెప్పండి.

"చిరంజీవిగారి చెల్లెలుగా నటించడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది."

రంగానికెలా వచ్చారు?

"అనుకోకుండానే వచ్చాను. మా అక్కయ్య తమిళరంగంలో కెమెరావుమన్‌గా పని చేస్తారు. ఆమెద్వారా ఓ తమిళచిత్రంతో చిత్రరంగానికి పరిచయమయ్యాను."

ఎలాంటి పాత్రలు చేశారు? చేయాలనుకుంటున్నారు?


"పాజిటివ్, నెగెటివ్ పాత్రలు అన్నీ చేశాను. గుర్తింపు తెచ్చుకునే పాత్రలు చేయాలనేది నా ఆశయం. తమిళ, కన్నడ, మలయాళ, తెలుగు టీవీసీరియల్స్‌తో, చిత్రాలతోటీ బిజీగా వున్నాను. నా అభిమానులకు నా కృతజ్ఞతలు."

ఎస్.

## భవిష్యహీరోల కోసం ఇప్పటినుంచీనా?

ఇటీవల ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు సుభాష్‌ఘై చిన్నపిల్లల కోసం స్టార్లందరి ఇళ్లకూ వెళుతున్నాట్ట. ఎందుకో తెలుసా? వారికి పదహారేళ్లు దాటగానే హీరోలుగానో, హీరోయిన్లుగానో తీసుకోవటానికి ఇప్పటి నుంచే అడ్వాన్సు బుకింగులట! ఇప్పుడు ఆయన ఎంపిక చేసుకున్న అబ్బాయి జాకీష్రాఫ్ కుమారుడు టైగర్. టైగర్‌కు పదేళ్లు. అంతేకాదు, షారూఖ్‌ఖాన్ కొడుకు, రెండున్నరేళ్ల ఆర్యన్‌ను కూడా మాట్లాడుకున్నాట్ట. అయినా ఆ నాటికి వీళ్ల రేట్లు ఎంతగా పెరుగుతాయో, ఏమిటో! ఆర్యన్ కెరీరైతే ఇప్పుడే ప్రారంభమైంది. ఆర్యన్ 'కభీ ఖుషీ కభీ గమ్'లో చిన్న షారూఖ్‌గా నటించేస్తున్నాడు. ఆ చిత్రంలో ఆర్యన్ నటిస్తున్నది అమితాభ్‌బచ్చన్, జయాబచ్చన్, హృతిక్‌రోషన్, కాజోల్, కరిష్మాకపూర్ల సరసన నటిస్తున్నాడు. బాగుంది ఘై గారి ఆలోచన!

ఎన్.



సుమిత్ర కబుర్లు చెబుతూ కూర్చుంది. విజయ స్కూల్లో తనకు వచ్చిన బహుమతులను గురించీ, మార్కుల గురించీ చెప్పింది. నిర్మలకంతా ఆశ్చర్యమే! మధ్యలో సుమిత్ర లేచివెళ్లి ఓ పాకెట్ తీసుకొనివచ్చింది. అందులో మంచి పట్టు పరికిణీ గుడ్డ వుంది. "విజ్జీ ముచ్చటపడితే ఈ గుడ్డ మొన్ననే తీసుకున్నాం జానకీ! కుట్టించేందుకు అక్కడ ఎవరూ వ్యవధి లేకపోయింది. రాయగడలో మా బంధువులమ్మాయికి పెళ్లి వుంది. ఆయన తమ్ముడి కుమార్తెకు. దానికి వెళ్తున్నాం. ఆయన నేరుగా అక్కడికే వస్తారు. రెండురోజులలో కుట్టి ఇచ్చెయ్యాలి. మంచిరకం బట్టలెన్ని వున్నా అది ఇదంటేనే మోజుపడింది. పిల్లల ముచ్చట్లు తీర్చకుండా ఎలా వుండగలం చెప్పు?"

జానకి పరికిణీబట్ట అందుకుంది. మెత్తగా వుంది. ఆకర్షణీయమైన రంగు. నిర్మల ఆ బట్టని చేత్తో రాసి, "ఎంత బావుందో!" అని మురిసిపోయింది.

జానకి క్రింది పెదవి నెమ్మదిగా కరుచుకుని వదిలింది. పిల్లల ముచ్చట్లు తీర్చకుండా వుండలేకపోవటం నిజమే... కాని, తీర్చగలిగే అనువైన పరిస్థితులు అందరికీ వుంటాయా? నిమ్మీ కూడా అలాంటి పరికిణీ కోసం ఎన్ని మంచికలలు కంటూవుంటుందని! దాని కోరిక తనీ జన్మకి తీర్చగలదా? దాని బ్రతుకింతే కాబోలును, చిరుగులు పట్టిన లంగాలతో, ఎప్పుడూ చాకలి ముఖమెరుగని గుడ్డలతో, అంతే... అంతే! జానకి మనసు బరువెక్కుతూంది బాధతో.

విజయ బిస్కట్లు తెచ్చి చెల్లెలి చేతిలో పెట్టింది. సుమిత్ర అది గమనించి తొందరగా "అయ్యో విజ్జీ! అవెందుకే అలా ఖర్చు చేస్తావు? సాల్టు బిస్కట్లు కదా! నీ ఆరోగ్యం బావుండటం లేదని తెప్పించాను. నువ్వు తినటం మానేస్తావేం?" అంది, జానకి బాధపడుతుందనైనా ఆలోచించకుండా.

జానకి విజయని దగ్గరికి తీసుకొంటూ గాభరాగా-"ఏమ్మా, ఈ మధ్య ఒంట్లో బావుండటం లేదూ? జ్వరం ఏమైనా వస్తోందా?" అనడిగింది. విజయ లేదన్నట్లుగా తల అడ్డంగా తాటించింది.

"లేకపోవడమేమిటే?..."

సుమిత్ర మాటలు పూర్తికాకముందే జానకి మాట మార్చేస్తూ"సుమీ, నేను టేపు తీసుకుని రాలేదు... ఇక్కడెవరి దగ్గరైనా వుంటుందా?"-అంది.

"వరలక్ష్మి దగ్గర వుండవచ్చు" అంటూ వెళ్లి ఆమెనడిగి టేపు తీసుకొనివచ్చింది సుమిత్ర.

జానకి కొలతలు తీసుకుంది. బట్టకూడా కొలిచింది. "ఇందులోనే దానికి ఒక జాకెట్టుకూడా అవుతుందిగా!"

"కాదు సుమిత్రా. బట్ట మరికొంచెం ఎక్కువ తీసుకోవలసింది."

"అవుతుందన్నాడే కొట్టువాడు!"

సుమిత్ర మాటలలో అనుమానం జానకికి అర్థమైంది. ఆమె మనసు విలవిలలాడింది. "ఉహూ!" అంది నెమ్మదిగా.

పరికిణీ గుడ్డ తీసుకుని నిర్మలతోసహా బయలుదేరింది. వచ్చేముందు "సుమిత్రా, సాయంత్రం దాన్ని ఓసారి తీసుకొనివస్తావు కదూ?" అనడిగింది.

సుమిత్ర అనిష్టంగానే తల ఊపింది.

000

ఆ సాయంత్రం విజయను వెంటబెట్టుకుని సుమిత్ర రాలేదు. చీకటి పడేముందు నిర్మలే వెళ్లి చూసివచ్చింది.

జానకి మనసు బాధతో విలవిలలాడిపోయింది. ఆలోచనలతో ఆమె తల వేడెక్కిపోయింది. ఆ రాత్రి ఆమెకు కంటిమీద కునుకు లేదు. మరునాటి ఉదయానికల్లా బాగా జ్వరం వచ్చేసింది. ఆ జ్వరం మూడోనాటికి కాని తగ్గలేదు. పక్కింటావిడే నిర్మలకు అన్నీ చేసింది.

మూడోనాడు పథ్యం తీసుకుంది. ఇంకా నీరసం వదలలేదు. మధ్యాహ్నం మూడింటికి సుమిత్ర శంకరంగారి పనిమనిషి చేత కబురు చేసింది. సాయంత్రమే బస్సులో వెళ్లిపోవాలనీ, ఈలోగా తొందరగా పరికిణీ కుట్టి ఇచ్చెయ్యమనీను.

జానకి గాభరాగా మిషను ముందు కూర్చుంది. నీరసంతో తోపు వస్తున్నా లక్ష్యపెట్టలేదు. గుడ్డ జాగ్రత్తగా కత్తిరించి కుట్టడం ప్రారంభించింది. శ్రద్ధగా మంచిసైజులో బాగా కుట్టి ఇవ్వాలనే దీక్షతో పనిచేసింది. వాళ్లకి బస్సు తప్పిపోకముందే పట్టుకెళ్లిఇవ్వాలి. లేకపోతే సుమిత్ర ఏమైనా అనుకోగలదు.

ముప్పావుగంటలో పరికిణీ కుట్టడం పూర్తయింది. బస్సు ఆరింటికి వుంటుంది. ఇంకా చాలా టైముంది. పరికిణీ బాగా వచ్చింది. జానకి తృప్తిగా నిట్టూర్చింది.

పరికిణీని మడతపెడుతూ వుంటే, నిర్మల వచ్చి పక్కను చేరింది. ఆ పిల్లకి పరికిణీ బాగా నచ్చింది. ఒక్కలా మురిసిముక్కలవుతూంది. "అమ్మా, ఒక్కసారి కట్టుకుని అద్దంలో చూసుకుని ఇచ్చేస్తానే!"

జానకి మనస్సు చివుక్కుమంది. కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. "వద్దమ్మా!" అని వారించింది.

"ఒక్కసారంటే ఒక్కసారి ఇవ్వమ్మా!"

"పాడైపోతుంది, నిమ్మీ, అల్లరి పెట్టకూడదు."

"అమ్మా!"

"అబ్బా, చంపకే బాబూ! వద్దన్నాను. విను, అంతే!"

నిర్మల కళ్లలో నీళ్లు తిరగటం గమనించి జానకి మనసు బాధతో చివుక్కుమంది.

000

"అమ్మా, అన్నట్లు పిన్నిగారెండుకో రమ్మని చెప్పమన్నారే!" అంది నిర్మల ఏదో గుర్తుకు వచ్చినట్లుగా.

"ఎప్పుడు?"

"ఇందాక... నువ్వు పరికిణీ కుడుతున్నప్పుడు."

పిన్నిగారంటే పక్కింటావిడ.

"సరే, ఇప్పుడే వచ్చేస్తాను. నువ్వెక్కడికీ పారిపోకు. మీ శంకరం పెదనాన్న గారింటికి వెళ్దాం"అంటూ పరికిణీని పెట్టెమీద వుంచి పక్కింటికి వెళ్లింది జానకి. తీరా వెళితే ఆవిడ తననేమీ కబురు చెయ్యలేదని తెలిసింది.

ఇంటికి తిరిగివచ్చేసరికి నిర్మల పట్టుపరికిణీ, దానిమీద మాసిన చింకి జాకెట్టుతో నవ్వుతూ కనిపించింది! పిచ్చితల్లి! కట్టుకోకుండా వుండలేకపోయింది. ఎంత అబద్ధమాడింది! అది కట్టుకోవాలని ఎంత మనసుపడిందో!

వెలిగిపోతున్న ముఖంతో నవ్వింది నిర్మల.

"భడవా! కట్టేసుకున్నావూ?" నవ్వుతూ నిర్మల చెయ్యి అందుకోబోయింది జానకి. నిర్మల నవ్వుతూ ఆమెకు దొరక్కుండా ఇల్లంతా పరిగెత్తింది.

"ఆగవే పిచ్చితల్లీ! నీ సంబరం బాగానేవుంది!"

నిర్మల ఆగిపోయింది. తల్లిమాటలు విని కాదు. ఊడిపోతున తలుపుకున్న మేకుకి తగులుకుని పరికిణీ కొంతమేర చిరిగిపోవటం వల్లనే!

ఆ పిల్ల భయంతో వణికిపోతూంది.

జానకి ముఖం జేవురించుకుపోయింది. ఆవేశంగా ఒక్క ఉదుటున వెళ్లి దాని జుత్తు పట్టుకుని గుంజింది. "ఒసే ముండా! కట్టుకునేవరకు చచ్చిపోయేవు. ఈ చింకి పరికిణీ దానికెలా ఇవ్వను? నీ ఒళ్లు చీల్చినా పాపంలేదే రాక్షసీ!" ఆవేశంతో ఊగిపోతూ నిర్మలను బాదేసింది. ఆమె కళ్లు నిప్పులు కురుస్తున్నాయి. "నా పాలిట దయ్యంలా దాపురించావే! నీ కర్మ బాగుంటే నిన్నూ ఓ అయ్య తీసుకుపోయి పెంచుకునేవాడు. నీ రాత ఇలా తగలడింది! కోరికలకి మాత్రం కొదవలేదు. ఛీ! వెధవబ్రతుకు!"

నిర్మల వెక్కివెక్కి ఏడుస్తూంది. జానకి ఆయాసంతో రొప్పుతూంది.

జానకి విసురుగా పలకా, బలపం తెచ్చి పలకమీద "మళ్లీ ఇలాంటి తప్పు చెయ్యను!" అని రాసిచ్చి, "గోడకుర్చీ వేసి దిద్దుతూ కూర్చో. ఈ వేళ నీకు పచ్చి మంచినీళ్లుకూడా ఇవ్వను!" అంది.

నిర్మల పలక అందుకుంటూ ప్రయత్నంమీద గొంతు పెగుల్చుకుని "అమ్మా!" అని పిలిచింది.

"ఏం, రాణీగారికి ఇంకా ఏం కోరిక మిగిలిపోయింది?" కసిరినట్లుగా అడిగింది జానకి.

ఆ పిల్ల జంకుతూనే చెప్పింది-"నా బట్టలకోసం డబ్బులు దాస్తున్నావుగా? అది తీసి మళ్లీ గుడ్డకొని అక్కయ్యకి ఇచ్చేస్తే...?"

జానకి గతుక్కుమంది. ఆ డబ్బు ముందుముందు నిర్మల చదువుకోసం, బట్టలకోసం కష్టపడి తను ఆదా చేస్తున్నది! ఇప్పుడది ఖర్చు చెయ్యాలి... తప్పదు!

దుఃఖం ముంచుకువచ్చి, కుమార్తెను కౌగిలించుకుని ఏడవాలనిపించింది జానకికి. ప్రయత్నం మీద తమాయించుకుంది. డబ్బు తీసుకుని ఆదరాబాదరాగా వీధిలోకి బయలుదేరింది.

000

ఊళ్లోవున్న అన్ని బట్టలకొట్లూ గాలించగా ఎలాగో అలాంటి బట్టే దొరికింది. అలాంటి బట్ట అక్కడ దొరకటం నిజంగా తన అదృష్టమే! దాచిన డబ్బంతా ఆ బట్టకోసమే అయిపోయింది. బిల్లు ఇస్తూంటే చెయ్యి తీవ్రంగా వణికింది.

పాకెట్ తీసుకుని వడివడిగా ఇంటికి వచ్చిపడింది జానకి. వస్తూనే మిషను ముందు కూర్చుంది. బట్ట జాగ్రత్తగా కత్తిరించి మళ్లీ పరికిణీ కుట్టడం ప్రారంభించింది. సాయంత్రానికి అందించలేకపోతే సుమిత్ర తప్పకుండా అపార్థం చేసుకుంటుంది. ఆమె మనస్తత్వమే అంత. ఆలోచనలు చిందరవందరగా ముసురుకుంటున్నాయి. జానకి ఆలోచనల్ని దూరంగా నెట్టి స్తిమితపడటానికి ప్రయత్నిస్తూ పరికిణీ కుట్టడం పూర్తిచేసింది. భయంచేతనో ఏమో, ఈసారి బాగా టైం తీసుకుంది. పరికిణీ పూర్తి అయేసరికి ఆరు కావస్తూంది.

పరికిణీని మడతపెట్టి కాగితంలో చుట్టి తొందరతొందరగా నడుచుకుంటూ శంకరం గారింటికి దారితీసింది. ఆ ఇల్లు చేరి మెట్లెక్కబోతూనే ఎవరో అదిమిపట్టి ఆపినట్లుగా ఆగిపోయింది జానకి. తాళం ఆమెను వెక్కిరించింది. జానకి చకితురాలైంది. నీరసం ఆవరించింది.

పక్కింటావిడ చెప్పింది: "అయ్యో, జానకమ్మా, ఇలా చేశావేమిటి? వాళ్లంతా వెళ్లి అప్పుడే అరగంట అయింది. ఈ పాటికి బస్సుకూడా వెళ్లిపోయివుంటుంది. నీకోసం ఎంతలా చూశారనీ! సుమిత్ర ఎంతలేసి మాటలందనుకున్నావు? మాయమాటలు చెప్పి ఆ గుడ్డను రెండోదానికీ పరికిణీ కుడదామనుకున్నావుట. రెండుమాటలు పడినా మంచిగుడ్డ వస్తుంది కదా అనుకున్నావుట..."

జానకి మరి వినలేకపోయింది. వెల్లువలా వస్తున్న దుఃఖాన్ని పెదిమలమధ్య బంధించి ఎవరో తరుముతున్నట్లుగా ఇంటివేపు దారితీసింది.

ఇల్లు చేరేసరికి నిర్మల కూర్చున్నచోటనే నిద్రపోతూ కనిపించింది. తలుపు చప్పుడు వినిపించి చప్పున కళ్లు తెరిచి అడిగింది"ఏమ్మా, పరికిణీ అక్కకి ఇవ్వలేదూ?" అని.

జానకి భళ్లున ఏడుస్తూ కుమార్తెను గుండెలకు బలంగా అదుముకుని దానితలను కన్నీళ్లతో తడిపేసింది.

ఆ పిల్ల అంతసేపూ దిద్దుతూ కూర్చున్న పలక జానకి వక్షాన్ని కఠినంగా హత్తుకుంది!

